కామారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

ఆటో డ్రైవర్లకు పింఛన్లు ఇవ్వాలి

- **యూనియన్ నేతలు వెంకటేశం, కమతం యాదగిరి**

హిమాయత్‌నగర్/కామారెడ్డి, జనవరి 24: యాభై ఏండ్లు నిండిన ఆటో డ్రైవర్లకు సామాజిక పింఛన్లు ఇవ్వాలని తెలంగాణ ఆటో, రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ వెంకటేశం, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో బుధవారం జరిగిన యూనియన్ నగర కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో రాష్ట్రంలోని సుమారు 7 లక్షల మంది ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని, వారందరికీ ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని కోరారు. ఇదిలా ఉండగా, ఆటో యూనియన్ ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 20 వేల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని తెలిపారు.

'వైద్య' పద్దు రూ.15 వేల కోట్లు!

- **ఆర్థికశాఖకు అధికారుల అంచనాలు**

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): వచ్చే ఆర్థిక సంవత్సరంలో వైద్యారోగ్యశాఖకు రూ.15 వేల కోట్ల మేర నిధులు అవసరమని అధికారులు ప్రభుత్వాన్ని కోరారు. బడ్జెట్ కేటాయింపుల ప్రతిపాదనలపై బుధవారం సచివాలయంలో మంత్రులు భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు సమగ్ర నివేదికను వారికి అందజేసినట్టు తెలిసింది. రాష్ట్రంలో ప్రస్తుతం 25 మెడికల్ కాలేజీలకు శాశ్వత భవనాలు నిర్మించాల్సి ఉన్నది. అనుబంధ దవాఖానల అప్‌గ్రేడేషన్ పూర్తిచేయాల్సి ఉన్నది. దీంతోపాటు వరంగల్ మల్టి సూపర్ స్పెషాలిటీ దవాఖాన, హైదరాబాద్ చుట్టూ నాలుగు టిమ్స్ దవాఖానలు, నిమ్స్ విస్తరణ, ఇప్పటికే మంజూరైన నర్సింగ్ కాలేజీల నిర్మాణాలు చేపట్టాల్సి ఉన్నదని, ఈ దఫా రూ.15వేల కోట్ల వరకు నిధులు అవసరమన్నారని తెలుస్తున్నది.

విశ్వకర్మ శిల్పులను ప్రభుత్వం ప్రోత్సహించాలి

- **విశ్వకర్మ మాతృ సంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి**

హైదరాబాద్, జనవరి24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విశ్వకర్మ జాతి శిల్పులను ప్రభుత్వం ప్రత్యేకంగా గౌరవించాలని, ప్రతీ ఏటా ప్రఖ్యాత శిల్పుల పేరుతో అవార్డులు అందజేయాలని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. రాష్ట్రంలో ప్రప్రథమంగా తమ మాతృ సంఘం ఆధ్వర్యంలో అమర శిల్పి జక్కనాచార్య పురస్కారం, విశ్వశిల్పి రామప్ప పురస్కారాలను అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఆచార్య జయశంకర్, లింగమూర్తి, రావూరి భరద్వాజ పేరిట అవార్డులు ఇవ్వాలని కోరారు.

మతపర రాజకీయాలను తిప్పికొట్టాలి

- **యంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి అశోక్ ఓంకార్**

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): మతపర రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలని యంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాదులో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలకు తెరలేపిందని విమర్శించారు.

కొలిక్కిరాని ఏపీ భవన్ విభజన

- **ఏడో ప్రతిపాదనకూ పూర్తిగా సమ్మతించని ఏపీ**
- **తెలంగాణ సూచనకు పాక్షిక అంగీకారం**
- **నష్టమే అంటున్న అధికారులు**

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణ, ఏపీకి ఉన్న ఉమ్మడి ఆస్తుల విభజన అంశం ఇప్పట్లో కొలిక్కి వచ్చేలా లేదు. ఈ ఆస్తుల విభజనకు గత పదేండ్లలో వచ్చిన ఆరు ప్రతిపాదనలతో పాటు తాజాగా వచ్చిన ఏడో ప్రతిపాదనకు కూడా ఏపీ పూర్తిస్థాయి సమ్మతిని తెలుపలేదు. దీంతో ఇది కూడా అటకెక్కే అవకాశం ఉన్నది. అదే జరిగితే కేంద్ర ప్రభుత్వం మరో ప్రతిపాదన చేస్తుందా? లేక చేతులెత్తేస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఢిల్లీలోని పాత ఏపీ భవన్ పంపకాల కోసం రెండు రాష్ట్రాల అధికారులతో ఇప్పటికే పలు భేటీలు నిర్వహించిన కేంద్ర ప్రభుత్వం.. తాజాగా ఈ నెల 2న మరో సమావేశాన్ని నిర్వహించింది. ఈ భేటీ తర్వాత తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే స్పందించింది. గతంలో ఏ ప్రతిపాదనపై ఇలా స్పందించని ఏపీ.. ఇప్పుడు వెంటనే స్పందించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నదని ఢిల్లీ వర్గాలు చెప్తున్నాయి.

తెలంగాణకు 8 ఎకరాల 24 గుంటలు కేటాయించాలి

ఆస్తుల పంపకం సమస్యను త్వరగా పరిష్కరించాలని తెలంగాణ సీఎస్ శాంతికుమారి ఈ నెల 8న కేంద్రానికి లేఖ రాశారు. ఢిల్లీ అశోకా రోడ్డులోని శబరి, స్వర్ణముఖి బ్లాక్‌లతోపాటు నర్సింగ్ హాస్టల్, పటౌడీ హౌజ్‌లో తెలంగాణకు వాటా ఉన్నదని పేర్కొన్నారు. చారిత్రక హైదరాబాద్ హౌజ్‌ను ఆనుకొని మూడెకరాల్లో ఉన్న శబరి బ్లాక్‌ను, పటౌడీ హౌజ్‌లో ఖాళీగా ఉన్న ఐదెకరాల 24 గుంటల స్థలాన్ని కలిపి తెలంగాణకు మొత్తం 8 ఎకరాల 24 గుంటలు కేటాయించాలని కోరారు. ఇది రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న 41.68 శాతానికి సమానమని తెలపడంతో ఏపీ సైతం కొంత సానుకూలంగా స్పందించింది. కానీ, ఈ ప్రతిపాదన వల్ల తెలంగాణకే నష్టమన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. వాస్తవానికి ఇక్కడ ఉన్న మొత్తం స్థలం తెలంగాణకే చెందుతుందన్న వాదన ఉన్నది. ఎందుకంటే.. హైదరాబాద్ హౌజ్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకుని అందుకు ప్రత్యామ్నాయంగా ఈ స్థలాన్ని ఇచ్చింది. అందువల్ల ఈ మొత్తం స్థలాన్ని తెలంగాణకే ఇచ్చి ఏపీకి మరో చోట స్థలం కేటాయించాలన్న సూచనలు ఉన్నాయి. ఇది కుదరకపోతే అక్కడ ఉన్న స్థలంలో ఒకవైపు భాగాన్ని తెలంగాణకు, మరోవైపు భాగాన్ని ఏపీకి కేటాయిస్తే సరిపోతుందని అధికారులు చెప్తున్నారు.

ఏపీ అభ్యంతరాలు, షరతులు

ఢిల్లీలోని ఉమ్మడి ఆస్తులను పంపిణీ చేయాలని ఏపీ సైతం ఈ నెల 18న కేంద్ర హోంశాఖ కార్యదర్శికి లేఖ రాసింది. భూ కేటాయింపులకు సంబంధించి తెలంగాణ చేసిన ప్రతిపాదనపై తమకున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. తెలంగాణ ప్రతిపాదించినట్టు భూమిని కేటాయిస్తే అందులో ఏపీకి ప్రత్యేకంగా ఒక రోడ్డు ఇవ్వాల్సి ఉంటుందని.. కానీ, ఆ రోడ్డులో ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు దాదాపు రూ.250 కోట్లు అవసరమవుతాయని తెలిపింది. ఆక్రమణలు తొలగించకపోతే ఏపీకి కేటాయించే భూమిని వినియోగించుకోలేమని పేర్కొన్నది. ఒకవేళ ఆక్రమణలు తొలగించని పక్షంలో ఏపీకి శబరి, పటౌడీ హౌజ్ బ్లాక్‌లలో సమాన వాటా కేటాయించాలని డిమాండ్ చేసింది. ఈ షరతులకు ఒప్పుకుంటే కేంద్రం చేసిన ఏడో ప్రతిపాదన తమకు సమ్మతమేనని స్పష్టం చేసింది.

మొత్తం రూ.7,110 కోట్ల విలువైన భూములు

ఢిల్లీలోని ఉమ్మడి ఏపీ భవన్ మొత్తం విలువను రూ.7,110 కోట్లుగా కేంద్ర ప్రభుత్వం నిర్ధారించింది. 19.73 ఎకరాల్లో విస్తరించిన ఏపీ భవన్ భూమి విలువను రూ.7,089 కోట్లుగా, భవనం విలువను రూ.20.25 కోట్లుగా లెక్కగట్టింది. వీటిలో ఏపీకి 58.32%, తెలంగాణకు 41.68% ఆస్తులు పంపిణీ చేయాల్సి ఉన్నది. అంటే.. ఏపీకి రూ.4146.5 కోట్ల విలువైన 11.32 ఎకరాలు, తెలంగాణకు రూ.2963.5 కోట్ల విలువైన 8.40 ఎకరాల భూమి రావాల్సి ఉంటుంది.

ట్రిపుల్ ఆర్ భూసేకరణ నిధులు ఇవ్వండి

- **సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖలు**

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): భారతమాల ఫేజ్-1 కింద కేంద్రం నిర్మించనున్న రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) భూసేకరణ వ్యయంలో 50% నిధులను భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కు జమ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం రెండు లేఖలు రాశారు. రూ. 26 వేల కోట్లకు పైగా అంచనా వ్యయంతో తెలంగాణకే తలమానికంగా నిలిచేలా హైదరాబాద్ నగరం చుట్టూ 350 కిలోమీటర్ల పొడవున రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి అయ్యే ఖర్చును కేంద్రం పూర్తిగా భరిస్తున్నదని తెలిపారు.

నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యమివ్వాలి

- **బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్**

హైదరాబాద్, జనవరి24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో త్వరలో ప్రకటించబోయే నామినేటెడ్ పదవుల్లో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బుధవారం సెక్రటేరియట్‌లో ప్రత్యేకంగా కలిసి, బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న బీసీ సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని కోరారు. ప్రైవేట్ యూనివర్సిటీల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్సు జారీ చేయాలని డిమాండ్ చేశారు. బీసీ జనగణన, బీసీ డిక్లరేషన్ అమలు, విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై మంత్రితో చర్చించినట్టు వివరించారు. సమావేశంలో దొంత ఆనందం, బండారి పద్మావతి, దుర్గేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సీఎం, మంత్రులు పట్టించుకుంటలేరు!

- **సమస్యలు వినేందుకు టైమిస్తలేరు**
- **అధికారం ఉన్నా గుర్తింపు లేదని యూత్ కాంగ్రెస్ నేతల అసంతృప్తి**
- **జగ్గారెడ్డి, మధుయాష్కీ బుజ్జగింత**

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): 'ముఖ్యమంత్రి, మంత్రులు మమ్మల్ని పట్టించుకోవడం లేదు. వారికి మా సమస్యలు చెప్పుకుందామన్నా.. మాకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు' అని యువజన కాంగ్రెస్ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి తీసుకురావడం కోసం క్షేత్రస్థాయిలో ఎన్నో వ్యయప్రయాసలకోర్చిన తమకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే ఎలా? అని వాపోయారు. తమకు గుర్తింపు లభిస్తుందన్న నమ్మకం కలుగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఏవిధంగా కష్టపడగలమని ప్రశ్నించారు. గాంధీభవన్‌లో బుధవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు గుర్తింపు రావడం లేదని కొందరు కార్యవర్గ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయగా.. వర్కింగ్ ప్రెసిడెంట్లు జగ్గారెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ బుజ్జగించే ప్రయత్నం చేశారు.

గతంలో మాదిరిగా కలవడం కష్టమే!

'పార్టీ అధికారంలోకి వచ్చి 50 రోజులే అయింది. మీకు గుర్తింపు రావడానికి కొంత సమయం పడుతుంది. అప్పటి దాకా ఓపిక పట్టండి' అని జగ్గారెడ్డి సూచించారు. అధికారంలోకి వచ్చాక మునుపటి మాదిరిగా కలువడం కష్టమేనని జగ్గారెడ్డి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపైనే సీఎం, మంత్రులు ఎక్కువగా దృష్టి కేంద్రీకరించారని, అనుబంధ సంఘాలకు నామినేటెడ్ పోస్టుల విషయంలో కొంత జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనని జగ్గారెడ్డి తెలిపారు. ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ జోక్యం చేసుకుంటూ.. యువజన కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ తమ ప్రతిపాదనలతో నివేదిక ఇస్తే దానిని సీఎం, అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరుగడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

రెవెన్యూ పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

- **డిప్యూటీ సీఎం భట్టికి ట్రెసా విజ్ఞప్తి**

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు తెలంగాణ రెవె న్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. బుధవారం సచివాలయంలో డిప్యూటీ సీఎంకు వారు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల వెహికల్, మెడికల్, జీపీఎఫ్‌తో, సప్లిమెంటరీ శాలరీ బిల్లులతోపాటు విలీన వీఆర్‌ఏల వేతనాల బిల్లులు మంజూరు చేయాలని కోరా రు. కొత్తగా ఏర్పాటు చేసిన మండలాలు/డివిజన్ల ఉద్యోగులకు జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, వీరి సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలందించేందుకు రెవె న్యూ సిబ్బందిని పెంచాలని విజ్ఞప్తి చేశారు. తెలిపారు. కార్యక్రమంలో ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, కార్యదర్శి గౌతమ్‌కుమార్, ఉపాధ్యక్షులు బాణాల రాంరెడ్డి, నిరంజన్, రమణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించండి

- **సీఎం రేవంత్‌రెడ్డికి బండి సంజయ్ లేఖ**

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సర్పంచ్‌ల పెండింగ్ బి ల్లులను వెంటనే చెల్లిస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని బీజేపీ ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన సీఎంకి లేఖ రాశారు. సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి నిధులు రాక ఆర్థికంగా సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు 50 రోజులు కావొస్తున్నదని, దాదాపు 1,850 కోట్ల మంజూరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో స్థానిక ప్రతినిధులు, సర్పంచులు ఆర్థిక, మానసిక క్షోభకు గురవుతున్నారని పేర్కొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డితో 'కనుగోలు' భేటీ

- **50 రోజుల పాలన, లోక్‌సభ ఎన్నికలపై చర్చ**

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ వ్యూహకర్త సునీల్ కనుగోలు బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. అంతకు ముందు సచివాలయంలోనే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కొద్దిసేపు భేటీ అయ్యారు. ఆ తర్వాత ఇద్దరూ కలిసి ఆరో అంతస్తులోని సీఎం చాంబర్‌కు వెళ్లారు. అక్కడ సీఎంతో వారిద్దరూ సమావేశమయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 50 రోజులు గడిచిన నేపథ్యంలో ప్రభుత్వ పనితీరుపై క్షేత్రస్థాయిలో ప్రజల్లో ఉన్న అభిప్రాయం, సునీల్ కనుగోలు టీమ్ సేకరించిన ఫీడ్ బ్యాక్‌ను సీఎంకు వివరించినట్టు సమాచారం. ఆరు గ్యారంటీలపై వీరి మధ్య చర్చకు వచ్చినట్టు తెలిసింది. లోక్‌సభకు గడువుకు ముందే ఎన్నికలు జరుగనున్నాయన్న సమాచారంతో రాష్ట్రంలో ఎన్నికల వ్యూహంపై కూడా వీరు చర్చించినట్టు తెలిసింది.

- **మర్యాదపూర్వక భేటీ**

బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, చిత్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

థేమ్స్ నది తరహాలో మూసీ అభివృద్ధి

బ్రిటిష్ హైకమిషనర్‌తో సీఎం భేటీ • లండన్ పర్యటనపై చర్చించిన రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సచివాలయంలో బ్రిటిష్ హై కమిషనర్ అలెక్స్ ఎల్లిస్‌తో సమావేశమయ్యారు. లండన్ పర్యటనపై ముచ్చటించారు. లండన్‌లోని థేమ్స్ రివర్ ప్రాజెక్టు తరహాలో హైదరాబాద్‌లోని మూసీనది పునరుజ్జీవ ప్రాజెక్టు చేపట్టనున్నట్టు తెలిపారు. ఇటీవలి తన లండన్ పర్యటనలో థేమ్స్ నది నిర్వహణ తీరు, రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అభివృద్ధిపై అధ్యయనం చేసినట్టు చెప్పారు. అదే మాడల్‌లో మూసీ పునరుజ్జీవానికి తలపెట్టిన ప్రణాళికలను, ప్రాజెక్టు ఔట్‌లైన్ తదితర అంశాలను అలెక్స్‌తో చర్చించారు. మూసీనది పరీవాహక ప్రాంత అభివృద్ధి చేపట్టాలనే నిర్ణయం పట్ల బ్రిటిష్ హైకమిషనర్ హర్షం ప్రకటించారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్, ఎకో టూరిజానికి తమ సహకారం ఉంటుందని ఎల్లిస్ తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, డిప్యూటీ హైకమిషనర్ గారోత్ వైన్ ఓవెన్ తదితరులు పాల్గొన్నారు.

కలర్ మారింది కాన్వాయ్ మారింది

- *సీఎం సెక్యూరిటీ సిబ్బంది మొత్తం తొలగింపు?*
- *ఫార్చ్యూనర్లకు నలుపు రంగులో రీపెయింటింగ్*

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాన్వాయ్‌లో పలు మార్పులు చేశారు. గత సీఎం వాడిన పాత తెల్ల రంగు ఫార్చ్యూనర్లకు నల్లరంగుతో రీపెయింటింగ్ వేయించారు. ఆ కార్లలోనే సీఎం పర్యటనలు చేస్తున్నారు. దీనితోపాటు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 54 మంది సెక్యూరిటీ సిబ్బందిని కూడా తొలగించినట్టు విశ్వసనీయ సమాచారం. ముఖ్యమంత్రి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ గుమ్మి చక్రవర్తి మినహా మిగతావారిని తొలగించినట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం సీఎం భద్రత కోసం 55 మంది సిబ్బంది పని చేస్తున్నారు. వీరిలో 10 మంది ఎస్ఎస్టీ కమాండోలు కాగా, మిగతా వారు ఆర్మడ్ రిజర్వుడ్ విభాగానికి చెందిన వారు. ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలతో పాటు హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్ స్థాయి సిబ్బంది సీఎం భద్రతా విధులు నిర్వర్తిస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ రంగంలోకి ఎస్‌హెచ్‌జీలు

- **పీఆర్, మహిళా శిశు సంక్షేమశాఖ బడ్జెట్ సమీక్షలో మంత్రులు భట్టి, సీతక్క**

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): సాఫ్ట్‌వేర్, పర్యాటక రంగాలతోపాటు వ్యవసాయ ఆధారిత కుటీర పరిశ్రమలతో స్వయం సహాయక బృందాలను (ఎస్‌హెచ్‌జీ) అనుసంధానించి, మహిళా సాధికారతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ఎస్‌హెచ్‌జీల సభ్యులకు ఆర్థిక తోడ్పాటు అందించి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని సూ చించారు. బుధవారం సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల బడ్జెట్ అంచనాల రూపకల్పనపై ఆ శాఖ మంత్రి ధనసరి సీతక్కతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. మార్కెట్‌లో ఆర్గానిక్ పంట ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉన్నందున ఎస్‌హెచ్‌జీలను ఆర్గానిక్ ఫార్మింగ్ వైపు మళ్లించాలని సూచించారు. హైదరాబాద్ చౌరస్తాల్లో చిన్న పిల్లలను చూపిస్తూ యాచించే వారిని గుర్తించి పిల్లలను కాపాడటానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానలకు వచ్చే రోగుల అటెండర్లు, ముఖ్యంగా మహిళలకు షెల్టర్లు, ఆహార ఏర్పాట్లకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కార్పొరేట్ దవాఖానల్లోనూ ఆరోగ్యశ్రీ

- **వైద్యారోగ్యశాఖ సమీక్షలో మంత్రులు భట్టి, దామోదర**

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అన్ని కార్పొరేట్ దవాఖానల్లో రాజీవ్ ఆరోగ్యశ్రీ అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ప్రీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం సచివాలయంలో వైద్యారోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల బడ్జెట్ అంచనాల రూపకల్పనపై వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శాఖ పనితీరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను వివరించారు. డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే ఆరు గ్యారెంటీల్లో ఒకటైన ఆరోగ్యశ్రీ సాయాన్ని రూ.10 లక్షలకు పెంచామని గుర్తుచేశారు.

పర్యాటక రంగం అభివృద్ధికి ప్రాధాన్యం

- **స్పెయిన్‌లో మంత్రి జూపల్లి**

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక రంగాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేస్తున్నామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఎఫ్ఐటీయూఆర్ పేరుతో స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లోని ఐఎఫ్ఈఎంఏలో జరుగుతున్న అంతర్జాతీయ టూరిజం ట్రేడ్ ఫెయిర్‌లో బుధవారం తెలంగాణ పర్యాటక శాఖ స్టాల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా బోనాలను కన్నుల పండువగా నిర్వహించారు. ఒగ్గుడోలు, ఒగ్గుకథ, కూచిపూడి, భరతనాట్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ప్రభుత్వ ప్రతినిధిగా కొనసాగుతూనే ఎంపీగా పోటీ చేస్తా

- **డాక్టర్ మల్లు రవి స్పష్టీకరణ**



హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా కొనసాగుతూనే నాగర్‌కర్నూల్ నుంచి ఎంపీగా పోటీ చేస్తానని పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ఎంపీ విజయసాయిరెడ్డి ఢిల్లీలో ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా కొనసాగుతున్నారని గుర్తు చేశారు. వైఎస్ హయాంలో నాలుగేండ్లపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా ఢిల్లీలో పని చేసిన అనుభవం తనకు ఉండటం వల్లనే రేవంత్‌రెడ్డి తనను మళ్లీ అదే పోస్టులో నియమించారని వివరించారు. ఈ నెల 28న ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించనున్నట్టు చెప్పారు. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు త్వరగా అనుమతులు వచ్చేలా కృషి చేయాలని రేవంత్ సూచించినట్టు తెలిపారు.

మల్టినేషనల్ కంపెనీలతో ఒరిగేదేం లేదు!

మొదటిపేజీ తరువాయి...

బహుళజాతి సంస్థలతో అభివృద్ధి సాధ్యమన్నది గోబెల్స్ ప్రచారం మాత్రమేనని భట్టి అభిప్రాయపడ్డారు. బహుళజాతి సంస్థల ద్వారా సాధించే అభివృద్ధి కంటే ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించడం ద్వారా ఎక్కువ అభివృద్ధి సాధించవచ్చునని స్పష్టంచేశారు. మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని టూరిజంప్లాజాలో నిర్వహించిన వెండర్స్ డెవలప్‌మెంట్ కార్యాక్రమంలో భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఉత్పత్తి రంగంగా ఉన్న వ్యవసాయరంగం నుంచి దేశాన్ని పారిశ్రామికీకరణ వైపు నడిపించేందుకు అప్పటి ప్రభుత్వాలు పెద్ద ఎత్తున చేపట్టిన చర్యలు, ముఖ్యంగా పంచవర్ష ప్రణాళికలు, మిశ్రమ ఆర్థిక విధానాల కారణంగానే నేడు దేశం పురోగమిస్తున్నదని చెప్పారు. 'ఇంత పెద్ద సువిశాల దేశంలో, అనేక వ్యత్యాసాలు ఉన్న మన సమాజంలో ఉత్పత్తి రంగాలన్నింటినీ ప్రభుత్వ ఆధీనంలో ఉంచాలనే ఉద్దేశంతోనే ఆనాడు ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేశారని వివరించారు. మిశ్రమ ఆర్థిక విధానం ద్వారానే ప్రజలందరికీ న్యాయం జరుగుతుందనే ఆలోచనతో వీటిని ఏర్పాటు చేశారని చెప్పారు. ఆ పునాదులు, ప్రణాళికలే నేడు మనందరినీ ముందుకు నడిపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం కొనసాగుతున్న ప్రపంచీకరణ, సరళీకృత ఆర్థిక విధానాల వల్ల బహుళజాతి కంపెనీలొచ్చి దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను, అనేక స్టార్టప్ కంపెనీలను మింగేస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. అందరికీ పంపిణీ కావాల్సిన సంపద ఏ కొద్దిమందికో చెందుతున్నదని, ఈ పరిణామం మానవ సమాజాన్ని ప్రభావితం చేస్తున్నదని చెప్పారు. రేవంత్ పర్యటన వల్ల అంతర్జాతీయ కంపెనీల నుంచి వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ప్రభుత్వం ఘనంగా ప్రచారం చేసుకుంటున్న తరుణంలో ఉపముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారాయి.

ఎంఎస్ఎంఈలను ప్రోత్సహిస్తాం

దేశ సంపద అందరికీ పంపిణీ కావాలంటే ఎంఎస్ఎంఈలను పెద్ద ఎత్తున ప్రోత్సహించడమే మార్గమని భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. ఉద్యోగాల కల్పన, సామాజిక న్యాయం, అందరి అభివృద్ధి వీటిద్వారానే సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈలను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు దేశానికి, రాష్ట్రాలకు ఒక ప్రణాళిక ఉండాలని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో పారిశ్రామిక క్లస్టర్లను పెంచడం, యువతను ప్రోత్సహించడం, ఆర్థిక సహాయం, విజ్ఞానం అందజేయడం ద్వారా వారిని మంచి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దవచ్చని చెప్పారు. తద్వారా జీడీపీని పెంచుకునేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. రాబోయే రోజుల్లో పారిశ్రామిక క్లస్టర్లను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, మంచి ప్రోత్సాహకాలు ఇస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం సంధానకర్తగా ఉండి ఎంఎస్ఎంఈలకు కావాల్సిన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నదని చెప్పారు. సమాజంలోని అన్ని వర్గాలవారిని కలుపుకొని పోతూ వనరులను సమానంగా పంచగలిగినప్పుడే, సంపద సృష్టించే రంగాల్లో అందరినీ భాగస్వాములను చేయగలిగితేనే సమసమాజ స్థాపన జరుగుతుందని పేర్కొన్నారు. ఇండస్ట్రీ రంగంలో, వర్క్ డిస్ట్రిబ్యూషన్‌లో అన్ని వర్గాలకు భాగస్వామ్యం ఉండాలని ఆకాంక్షించారు. పరిశ్రమల స్థాపనకు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు భూకేటాయింపు అంశం ప్రభుత్వం చూసుకుంటుందని భరోసా ఇచ్చారు. స్టార్టప్ కంపెనీలను కూడా ప్రోత్సహిస్తామని స్పష్టంచేశారు. స్టార్టప్‌లు కూడా ఇప్పుడు వారి చేతుల్లో లేకుండా పోతున్నాయని, ఎంఎన్‌సీలు వాటిని కూడా తినేస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఎంఎస్ఎంఈలు కోరుతున్నవిధంగా సబ్సిడీలు, విద్యుత్తు సబ్సిడీలతోపాటు ఇతర కోరికలు తీర్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమం అనంతరం అక్కడ వివిధ కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన ప్రారంభించి పరిశీలించారు.

డీకే అరుణ రూ.15 కోట్లు అడిగారు

ఇస్తేనే 2019లో ఎంపీగా పోటీ చేస్తానన్నారు: వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 24 : 2019 సార్వత్రిక ఎన్నికల్లో రూ.15 కోట్లు ఇస్తేనే ఎంపీగా పోటీ చేస్తా'నని డీకే అరుణ పీసీసీ అంతర్గత సమావేశంలో డిమాండ్ చేశారని సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి తెలిపారు. బుధవారం మహబూబ్‌నగర్‌లోని జేజేఆర్ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తన మాటలు అసత్యమైతే రాముడి గుడిలో ప్రతిజ్ఞ చేయడానికి సిద్ధమేనని స్పష్టం చేశారు. ఆమె ఏదైనా రామాలయానికి వచ్చి రూ.15 కోట్లు అడగలేదని చెబితే తాను రాజకీయాల నుంచి తప్పుకుంట' అని చెప్పారు.

రంగనాయకసాగర్ నీటి విడుదల

- **1.10 లక్షల ఎకరాలకు మేలు**
- **మంత్రి కొండా సురేఖ**

సిద్దిపేట, జనవరి 24 : సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్ ఎడమ కాలువ ద్వారా 70 వేల ఎకరాలకు, కుడికాలువ ద్వారా 40 వేల ఎకరాలకు సాగునీరు వదులుతున్నట్టు దేవాదాయ శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ తెలిపారు. బుధవారం రంగనాయకసాగర్ నుంచి కాల్వలకు సాగునీటిని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇరిగేషన్ ఈఎన్‌సీ హరిరామ్‌తో కలిసి ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రంగనాయక సాగర్ కింద 1.10 లక్షల ఎకరాల సాగు భూమి ఉన్నదని అన్నారు. రంగనాయక సాగర్‌లో ప్రస్తుతం 2.4 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నదని చెప్పారు. ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణం పూర్తయిందన్నారు. ఎడమ కాలువ ద్వారా సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు, సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట, సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాలకు, కుడి కాలువ ద్వారా సిద్దిపేట అర్బన్, నంగునూరు మండలాల్లోని చెక్‌డ్యామ్‌లు, చెరువులకు సాగునీరు విడుదల చేశామని తెలిపారు.

స్విచ్ ఆన్‌చేసి నీటిని విడుదల చేస్తున్న మంత్రి కొండా సురేఖ